క్లుప్తంగా

కాలువ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏఈ గోనేనాయక్

సి.బెళగల్: మండల కేంద్రంలో జరుగుతున్న ముగురు కాలవ నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ గురువారం పరిశీలించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు అంగన్‌వాడీ కేంద్రం–5 వద్ద సర్పంచ్ పాండురంగన్న మురుగుకాల నిర్మాణ పనులను ప్రారంభించారు. కాలువపై కల్వర్ట్‌ను సైతం నిర్మించాలని సర్పంచ్‌కు, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్‌కు ఏఈ సూచించారు.

నాటుసారా స్వాధీనం



సారా బట్టీని ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కృష్ణగిరి మండలం చిట్యాల, వెల్దుర్తి మండలం నరసాపురం గ్రామాల్లో గురువారం కోడుమూరు సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 300 లీటర్ల బెల్లం ఊట, 10 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, నిందితులు అడవి రంగన్న, రామాంజనేయులును అరెస్ట్ చేసి డోన్ కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, వెంకటేష్‌నాయక్, అన్సర్‌బాషా, విరూపాక్షిరెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత అని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని కంబదహాల్, సి.బెళగల్, పోలకల్ గ్రామాల్లో పర్యటించి, ఆయా గ్రామాల్లో జరుతుగుతున్న పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ విత్తన దుకాణదారులను హెచ్చరించారు. గురువారం కోడుమూరులోని విత్తన డీలర్లతో ఏఓ సమావేశం నిర్వహించడంతో పాటు, విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రతి దుకాణదారుడు అనుమతి ఉన్న కంపెనీల విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. విత్తన కొనుగోలు సమయంలో రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. అనుమతి లేని విత్తనాలమ్మితే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ధరల పట్టికను దుకాణంలో ఏర్పాటు చేయాలని ఏఓ సూచించారు.

వంగవీటి రంగా జయంతి



వంగవీటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని శ్రీకృష్ణదేవరాయుల బలిజ సంఘం ఆధ్వర్యంలో గురువారం దివంగత కాపునేత వంగవీటి మోహన్‌రంగా జయంతి వేడుకలు జరిపారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమావేసి నివాళులర్పించారు. వంగవీటి త్యాగాలు, ఆయన సాధించిన విజయాలను నాయకులు గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు మాదాసు వెంకటస్వామి, బాలక్రిష్ణ, శంకర్, రామక్రిష్ణ, రాజశేఖర్, నారాయణ, రమణయ్య, కమలాకర్, సుధాకర్, నరేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

● వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న రాంభూపాల్‌రెడ్డి



హాజరైన కార్యకర్తలు

కల్లూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు అధైర్య పడొద్దని, తాను అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు, ఓర్వకల్లు మండలాల కార్యకర్తలు, నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ ఆగడాలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ప్రజల సమస్యలపై కలిసికట్టుగా పోరాడుదామన్నారు. ఏ అవసరమొచ్చినా తనను సంప్రదించాలన్నారు. అనంతరం ఆయన విలేరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు అధికమయ్యాయన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. తమ ప్రభుత్వంలో హింసాత్మక ఘటనలకు ఏనాడూ పాల్పడలేదన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు దాడులు, దౌర్జన్యాలు మానుకుని, ఎన్నికల హామీలను, సూపర్ సిక్స్ పథకాలను నెరవేర్చడంపై దృష్టి సారించాలన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడుస్తా..

పార్టీ మారుతున్నారని నియోజకవర్గంలో చర్చ జరుగుతుందని విలేకరులు ప్రశ్నించగా తాను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంటే నడుస్తానని రాంభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు సహజమన్నారు. వైఎస్సార్‌సీపీకి ఎన్నికల్లో 40 శాతం ఓట్లు వచ్చాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాల వల్ల రాష్ట్రం మరో శ్రీలంకగా మారుతుందని దుష్ప్రచారం చేసిన టీడీపీ నాయకులు.. ఎన్నికల్లో గెలవడం కోసం అంతకుమించి సంక్షేమ పథకాలు ఇస్తామని ఓటర్లను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చారన్నారు. ఎన్నికల హామీల అమలు కోసం ప్రభుత్వానికి కొంత సమయం ఇస్తామన్నారు. హామీలు నెరవేర్చకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాలకు దిగుతామన్నారు. సమావేశంలో కల్లూరు, ఓర్వకల్లు మండలాల ఎంపీపీలు బోయ శారద, తిప్పన్న, ఓర్వకల్లు జెడ్పీటీసీ రంగనాథ్‌గౌడ్, నాయకులు ఈశ్వరయ్య, కేశవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, చెన్నారెడ్డి, కల్లూరు, ఓర్వకల్లు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– అనంతరం అధికార పార్టీ నాయకుల దాడుల్లో గాయపడిన 11 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున చెక్కులను కాటసాని రాంభూపాల్‌రెడ్డి అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన కోనంగి శ్రీరాములు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్లూరు మండలం ముజఫర్ నగర్‌కు చెందిన కోనంగి శ్రీరాములు(49) మృతి చెందినట్లు ఎస్ఐ అశోక్ గురువారం తెలిపారు. బంధువులతో కలిసి ఆటోలో మహానందికి చేరుకొని స్వామి వారి దర్శనం అనతరం తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో పాణ్యం ఎస్సార్‌బీసీ కాల్వ సమీపంలో జాతీయరహదారిపై కాలకృత్యాలకు ఆటోను ఆపారు. మృతుడు శ్రీరాములు రోడ్డు దాటి ఆటో వద్దకు చేరుకుంటున్న క్రమంలో బైక్ ఢీకొట్టిందన్నారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులును పాణ్యం ప్రభుత్వాసుపత్రికి తరలించారన్నారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న రమేష్‌నాయక్‌కు గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారన్నారు. మృతుడికి భార్య కళావతి, కుమారుడు సంతానం. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు





స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు, ధ్వజ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామ సమీపంలో వెలసిన వేంకటేశ్వస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగా వైభవంగా జరిగాయి. నంద్యాల జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వేలాది తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. ధ్వజ వాహనంలో స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్లాంట్ యూనిట్ హెడ్ నవనీత్ చౌహాన్, జిందాల్ యాజమాన్యం సిబ్బంది, సీఎస్ఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి



మోడల్ స్కూల్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు



పాణ్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్షాల నాయకుడు

ఓర్వకల్లు: ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నెట్, నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ మండలంలో విజయవంతం చేశారు. విద్యాసంస్థల వద్దకు వెళ్లి మూయించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు అయ్యన్న, అఖిలభారత విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు రాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల నిర్వహణా బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, ఉన్నత చదువుల ప్రవేశాల కోసం తప్పనిసరి చేసిన నెట్ విధానాన్ని పూర్తిగా తొలగించాలని వారు కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రాజు, అనిల్, శ్యామ్‌రాజు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: విద్యాసంస్థల బంద్ మండలంలో విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ, ఏఐఎఫ్‌బీ ఆధ్వర్యంలో నాయకులు పాణ్యంలో నాలుగుకూడలిలో నిరసన చేపట్టారు. నాయకులు బత్తిన ప్రతాప్, వనం వెంకటాద్రిలు మాట్లాడుతూ నీట్ బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. నీట్ పరీక్ష జరపడంలో ఎన్‌టీఏ విఫలమైంద,ఇ ఆ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

ఓర్వకల్లు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మల్లీశ్వరి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన జరిగిన సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, ఎంపీడీఓ మల్లీశ్వరి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.ముందుగా వివిధ శాఖల ద్వారా గత మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధిపై అధికారులు నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మల్లీశ్వరి మాట్లాడుతూ ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, లొద్దిపల్లె గ్రామాలలో ప్రజలు డయేరియా(అతిసార) వ్యాధికి గురైనట్లు తెలిసిందన్నారు. వైద్యాధికారులు తక్షణమే వాటి నివారణకు తగు చర్యలు తీసుకొని ఇతర గ్రామాలకు వ్యాప్తి చెందకుండా చూడాలని సూచించారు. అప్రకటిత విద్యుత్ కోతల వలను వ్యవసాయ విద్యుత్ మోటార్లు దెబ్బతింటున్నాయని కొందరు అధికారుల దృష్టికి తేగా ఈ సమస్యను పరిష్కరుస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. లొద్దిపల్లెలో సామూహిక మరుగుదొడ్డి నిర్మించాలని గ్రామ ఎంపీటీసీ సభ్యులు నాగశిరీష అధికారులను కోరారు. అలాగే ఉయ్యాలవాడ ఎస్సీ కాలనీలో త్రాగునీటి సమస్య ఉందని, ప్రత్యేక బోరు వేసి సమస్యను పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ శకుంతల, ఎంపీటీసీ సభ్యురాలు సరోసమ్మ అధికారుల దృష్టికి తెచ్చారు. గార్గేయపురం సమ్మర్ స్టోరేజి నుంచి నీళ్లు సక్రమంగా సరఫరా కావడంలేదని, ఈ సమస్యపై అధికారులు సరైన వివరణ ఇవ్వడంలేదని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పద్మానాభరెడ్డి సభదృష్టికి తేవడంతో గందరగోళం చోటుచేసుకుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు

● నంద్యాల జిల్లా డీఈఓ సుధాకర్‌రెడ్డి



గడివేముల జెడ్పీ పాఠశాలలో విద్యార్థినితో మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

గడివేముల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు నంద్యాల జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు గడిగరేవుల జెడ్పీ హైస్కూల్‌ను డీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం సిలబస్‌ను పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిచాలన్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ తదితర వస్తువులు ఎన్ని వచ్చాయి? ఇంకా ఎన్ని అవసరమో తెలియజేయాలన్నారు. పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లను అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం విక్టర్ ఇమ్మానియేల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆర్‌యూ బంద్ విజయవంతం

కర్నూలు కల్చరల్: ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టి విద్యా సంస్థల బంద్ రాయలసీమ విశ్వవిద్యాలయంలో విజయవంతమైంది. వర్సిటీలోని అన్ని విభాగాలను బంద్ చేయించి ఏడీ బిల్డింగ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆర్‌యూ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ నీట్ ప్రశ్నాపత్రాలను లీక్ చేసిన ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌డీ అడ్మిషన్లలో నెట్‌స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు, నిర్బంధాలు, అణచి వేత చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్ఓ నాయకులు శివ, మల్లేష్, మౌలాలి, జగదీష్, యశ్వంత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

కర్నూలు(అర్బన్): నందవరం మండలం జొహరాపురం గ్రామంలో కురువ మల్లేష్, నాగేంద్ర, పరమేష్, సరస్వతమ్మ, రాములమ్మపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని కురువ సంఘం జిల్లా నేతలు కోరారు. దాడిలో గాయపడి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని సంఘం నాయకులు తవుడు శ్రీనివాసులు, బీసీ తిరుపాలు, పుల్లన్న, రాయలసీమ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ తదితరులు పరామర్శించారు. పొలం విషయంలో సంజీవరెడ్డి, బాలురెడ్డి, అర్జున్‌రెడ్డి, రాఘవరెడ్డి, రామక్రిష్ణారెడ్డి తదితరులు తమను కొడవళ్లు, రాడ్లు, కర్రలతో తీవ్రంగా గాయపరిచారని బాధితులు నాయకులకు విన్నవించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వారు డాక్టర్లను కోరారు.

రోడ్డు ప్రమాదంలో గౌండ మృతి

కర్నూలు: నగర శివారు సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై అబ్దుల్ జలీల్ (46) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం ఉదయం మృతిచెందాడు. అలంపూరుకు చెందిన అబ్దుల్ జలీల్ కర్నూలు పాతబస్తీలోని బేకారికట్ట వీధికి చెందిన మహిళను వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి కర్నూలులోనే నివాసం ఉంటున్నాడు. బుధవారం గౌండ పని నిమిత్తం అలంపూరుకు వెళ్లి సాయంత్రం తిరిగి కర్నూలుకు వస్తుండగా సెయింట్ జోసెఫ్ కళాశాల వద్ద ఎదురుగా మరో వాహనం వచ్చి ఢీకొంది. కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'విప్లవ జ్యోతి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: అల్లూరి సీతారామ రాజు జయంతిని పురస్కరించుకుని కవి డాక్టర్ తొగట సురేష్‌బాబు రచించిన 'విప్లవ జ్యోతి' పుస్తకాన్ని గురువారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆవిష్కరించారు. ముందుగా అల్లూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సాహితీ వేత్తలు డాక్టర్ వి.పోతన్న, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, కవులు, రచయితలు, కళాకారులు పాల్గొన్నారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులను అరెస్టు చేయాలి

కర్నూలు(సెంట్రల్): రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మలను దహనం చేసిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులను అరెస్టు చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కె.బాబురావు డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యాలయం ఎదుట బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ మాట్లాడిన మాటలను వక్రీకరిస్తున్నారన్నారు. రాహుల్‌గాంధీకి అన్ని మతాలు, కులాలు అంటే అభిమామని, ఆయన లౌకిక వాది అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు శాఖ గ్రంథాలయంలో గురువారం విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా ఘన నివాళి సమర్పించారు. గ్రంథాలయాధికారిని కౌసల్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే భారత జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య 61వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విద్యార్థులచే గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

వాహనదారులకు ఇబ్బంది కలిగించొద్దు



రోడ్డు సైడ్ వ్యాపారులు, ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ గౌతమి

కర్నూలు: వాహనదారులకు ఇబ్బంది కలిగించొద్దని ట్రాఫిక్ సీఐ గౌతమి రోడ్ సైడ్ వ్యాపారులకు సూచించారు. రోడ్డుకు ఇరువైపులా తోపుడుబండ్లు పెట్టుకుని వ్యాపారాలు సాగిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని వాహనదారుల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆమె గురువారం పాత ఈద్గా నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా బళ్లారి చౌరస్తా వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న తోపుడు బండ్లను స్వాధీనం చేసుకుని ట్రాఫిక్ స్టేషన్‌కు తరలించారు. తోపుడు బండ్ల వ్యాపారులు రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహించుకోవాలని, లేదంటే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఉపాధి పొందాలని సీఐ గౌతమి సూచించారు. ఆటోలు రోడ్లకు ఇరువైపులా నిలిపి వాహన రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. ఆటో స్టాండ్లలో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ డ్రైవర్లు వేగనియంత్రణ పాటించండి

ఆర్టీసీ బస్సులను నగరంలో నిదానంగా నడపాలని ట్రాఫిక్ సీఐ గౌతమి ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వేగంగా నడపడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ట్రాఫిక్ రద్దీ పెరగకుండా ఆర్టీసీ డ్రైవర్లు సహకరించాలన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్..

మైనర్ డ్రైవింగ్‌పై ట్రాఫిక్ పోలీసులు సాయంత్రం రాజ్‌విహార్ సెంటర్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలు, ఆటోలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తల్లిదండ్రులను పిలిపించి మందలించారు.

రోగులకు ఉత్తమ సేవలు అందించండి



క్యాన్సర్ వార్డులో రేడియోథెరపీ పరికరాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): రోగులకు ఉత్తమ సేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన ఆసుపత్రిలోని ఫిజియోథెరపీ, క్యాన్సర్, మెడికల్, చిన్నపిల్లల విభాగాలను తనిఖీ చేశారు. సూపర్ స్పెషాలిటీ విభాగంలోని డ్రైనేజీ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లను ఆదేశించారు. మెడికల్ వార్డుల్లో ట్యూబ్‌లైట్స్ మరమ్మతులు పూర్తి చేయాలని ఎలక్ట్రికల్ సిబ్బందికి సూచించారు. క్యాన్సర్ వార్డులోని పాత పరికరాలను ఖండిమినేషన్ చేసి డిస్పోజ్ చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి ఉన్నారు.

భూసేకరణ పూర్తి చేయాలి

● కలెక్టర్ పి.రంజిత్‌బాషా



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో చేపట్టనున్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను త్వరగా పూర్తి చేసి బాధిత రైతులకు పరిహారం అందేలా చూడాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో భూసేకరణ అంశంపై జేసీ నారపురెడ్డి మౌర్యతో కలసి రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. జాతీయ రహదారి 340సీ కింద నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు సఫా కళాశాల నుంచి గార్గేయపురం వరకు జరుగుతున్న బైపాస్ రోడ్డు, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, కర్నూలు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు కర్నూలు విద్యార్థులు

కర్నూలు (టౌన్): నగరానికి చెందిన విద్యార్థులు విశ్వాసరావు (టౌన్ మోడల్ స్కూల్), మల్లికార్జున (చైతన్య స్కూల్) జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. వీరిని గురువారం ఆర్క్ హాస్పిటల్ డాక్టర్ త్రినాథ్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి మాట్లాడుతూ ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో విశ్వాసరావు, మల్లికార్జున ప్రతిభ కనబరిచి వచ్చే నెల 1 నుంచి 4వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారన్నారు.

సాగు నీటి ప్రాజెక్టు పనులపై నేడు మంత్రి సమీక్ష

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులు, కాలువల్లో జరుగుతున్న పనులపై శుక్రవారం జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రిన్సిపల్ సెక్రటరీ సాయిప్రసాద్ విజయవాడలో సమీక్షించనున్నారు. సమావేశానికి ఆ శాఖ కర్నూలు ప్రాజెక్టు సీఈ కబీర్ బాషా ఉమ్మడి జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టు పనుల పురోగతి నివేదికలతో వెళ్లారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులు, కాల్వల్లో ఖరీఫ్ పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాత్కలికంగా పనులు చేసేందుకు రూ.19.50 కోట్లతో 178 పనులకు అంచనాలు తయారు చేసుకుని నివేదికను సీఈ తన వెంట తీసుకెళ్లారు.

విద్యార్థులందరికీ 'విద్యార్థి కిట్లు'

కర్నూలు (సిటీ): ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ విద్యార్థి కిట్లను అందించాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ వై.రాఘవరెడ్డి ఆదేశించారు. గురువారం సమగ్ర శిక్ష కాన్ఫరెన్స్ హాల్‌లో మండల విద్యాధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక అమలు చేయాలన్నారు. పాఠశాలలను ఎంఈఓలు నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. డీఈఓ కె.శామ్యూల్ , ఏడీ శామ్యూల్‌పాల్, డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, డీఈఓ ఆఫీస్ సూపరింటెండెంట్లు రాజశేఖర్, రవికుమార్, కోటేశ్వరరావు, హనుమన్న, ఎంఈఓలు పాల్గొన్నారు.

సంగీతం సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాలలో సంగీతం, నృత్యం సర్టిఫికెట్, డిప్లమా కోర్సుల థియరీ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అనుబంధంగా నిర్వహిస్తున్న థియరీ పరీక్షలకు గురువారం ఓకల్ కోర్సులో 24 మందికి 21, కూచిపూడి నృత్యం 31 మందికి 26 మంది, వయోలిన్ 3, నాదస్వరం 6, డోలు 5 కలిపి మొత్తం 61 మంది హాజరయయ్యారు. తెలుగు వర్సిటీ పరీక్షల అబ్జర్వర్ ఆచార్య సత్యనారాయణ పరీక్షల నిర్వహణను పరిశీలించారు.